సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 67 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం

36.4°/22.3°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఏఆర్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. గురువారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి తన చాంబర్‌లో రివ్యూ సమావేశం నిర్వహించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అత్యవసర పరిస్థితి ఏర్పడిప్పుడు ఏఆర్ సిబ్బంది విధులు కీలకమన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల కండీషన్ ఎప్పటికప్పుడు గమనించి మరమ్మతు చేయించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. గొడవలు, ఘర్షణల సమయంలో స్పెషల్ ఫోర్స్‌ను అధికంగా వినియోగించే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా



అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్‌లో ప్రొబెషనరీ ఆఫీసర్లు, 'కిమ్స్'సవీరాలో రిజిస్టర్డ్ నర్స్, ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ప్రొబేషనరీ ఆఫీసర్ ఉద్యోగానికి 30 ఏళ్లలోపు వయస్సు ఉండి ఎంబీఏ లేదా ఎంసీఏ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. సవీరా హాస్పిటల్‌లో ఉద్యోగాలకు 19 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండి జీఎన్‌ఎం లేదా బీఎస్సీ నర్సింగ్, డిప్లొమా ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలతో 7వ తేదీ ఉదయం 10.30 అనంతపురం కోర్టు రోడ్డులోని కార్యాలయానికి రావాలని ఆమె సూచించారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ



బీకేఎస్ మండలం రేకులకుంటకు వెళ్లి పింఛన్ ఇస్తున్న చిల్లవారిపల్లి వలంటీర్ మంజుల

పుట్టపర్తి అర్బన్: అక్టోబర్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ గురువారంతో ముగిసింది. జిల్లాలోని 2,73,975 మందికి రాష్ట్ర ప్రభుత్వం రూ.76,13,01,750 మంజూరు చేయగా వలంటీర్ల సహకారంతో 5 రోజుల్లోనే 2,71,652 మంది లబ్ధిదారులకు రూ.75,48,45,500 నగదు పంపిణీ చేసి రాష్ట్రంలో జిల్లాను 4వ స్థానంలో నిలిపారు. మొత్తం 99.15 శాతం మందికి పింఛన్ మొత్తాన్ని అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అక్షయ



జి భవ్యశ్రీ



జి. గౌతమి

చిలమత్తూరు: టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్యామ్‌భూపాల్‌రెడ్డి తెలిపారు. వారం క్రితం గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. ట్రిపుల్ జంప్‌లో డి.అక్షయ రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలవగా, 1500 మీటర్ల పరుగు పందెంలో జి.భవ్యశ్రీ రెండోస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే 5 కి.మీ పరుగు పందెంలో జి గౌతమి రెండోస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం వారిని అభినందించింది.

సెల్లు.. బాల్యానికి చిల్లు !

- పిల్లలు.. మొబైల్ ఫోన్లకు బానిసలు
- శాపంగా మారుతున్న తల్లిదండ్రుల గారాబం
- గంటల తరబడి అలవాటుతో అనేక సమస్యలు
- మానసిక ఎదుగుదలకు తీవ్ర ఆటంకం
- చిన్న వయసులోనే నరాలు, కళ్ల జబ్బులతో సతమతం



❐ కదిరి పట్టణంలోని అడపాల వీధికి చెందిన సుదర్శన్‌కు రెండేళ్ల కుమార్తె ఉంది. అన్నం తినాలంటే పాపకు సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందే. లేకుంటే గంట సేపు మారాం చేసేస్తుంది. మొబైల్ చేతికొచ్చే వరకూ ఏడుస్తూనే ఉంటుంది. తాము ఏం చెప్పినా వినదని సెల్‌ఫోన్‌లో ఏవైనా వీడియోలు చూపించేవరకూ తన కుమార్తె భోజనం తినదని తండ్రి సుదర్శన్ చెబుతున్నారు.

❐ అనంతపురంలోని ఓ ప్రముఖ ఆస్పత్రికి ఇటీవల ఓ వ్యక్తి తన ఐదేళ్ల కుమారుడిని తీసుకొచ్చారు. పిల్లాడికి కళ్ల నొప్పి పుడుతున్నాయని, ఒక్కోసారి ఎలా పడితే అలా ప్రవర్తిస్తున్నాడని వివరించాడు. సెల్‌ఫోన్‌లో ఎక్కువగా వీడియో గేమ్స్ ఆడుతుంటాడని తెలిపాడు. బాలుడిని పరీక్షించిన వైద్యులు.. సెల్‌ఫోన్ అతివినియోగం వల్లే సమస్యలు తలెత్తినట్లు నిర్ధారించారు. మందులివ్వడంతో పాటు సెల్ ఫోన్‌ను ఇకపై ఇవ్వొద్దని జాగ్రత్తలు చెప్పి పంపారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎదగాల్సిన బాల్యం ఆగిపోతోంది. నడక నేర్చుకుని నాలుగడుగులు కూడా వేయక ముందే సవాళ్లు ఎదుర్కొంటోంది. ఐదేళ్ల లోపు చిన్నారులు అరచేతిలోనే బందీగా

అనంతపురం జిల్లా జనాభా	22.41 లక్షలు
శ్రీ సత్యసాయి జిల్లా జనాభా	18.40 లక్షలు
ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లల జనాభా	4.50 లక్షలు
రెండు జిల్లాల్లో స్మార్ట్ ఫోన్లు	18 లక్షల వరకు
స్మార్ట్ ఫోన్ కలిగిన చిన్నారులు	సుమారు 1.20 లక్షలు పైనే

మారిపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడు లక్షలాది మంది చిన్నారులు మొబైల్‌కు అలవాటు పడి సవాలక్ష సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

తల్లిదండ్రుల గారాబం.. శాపం

కమ్యూనికేషన్ వ్యవస్థలో మొబైల్ ఫోన్ అవసరం ఏమిటో తెలిసిందే. కానీ వీటి అవసరమే లేని చిన్నారులకు అలవాటు చేసి బందీలుగా చేస్తున్నారు. ఐదేళ్లలోపు 70 శాతం మంది చిన్నారులకు ఆండ్రాయిడ్ ఫోన్‌తో పరిచయం ఏర్పడింది. మారాం చేస్తున్నాడు కదా అని తల్లిదండ్రులు అలవాటు చేస్తున్నారు. అలవాటయ్యాక అదీ లేకపోతే అన్నం తినే పరిస్థితి లేదు. చిన్నారులకు వచ్చిన ఈ వ్యసనం రకరకాల అనర్థాలకు దారి తీస్తున్నట్టు ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన న్యూరో వైద్యుల బృందం ఇటీవల వెల్లడించింది. చిన్నారుల ఎదుగుదలలో మొబైల్ అలవాటు తీవ్ర ప్రతికూలతలు చూపిస్తున్నట్టు తేలింది. ముఖ్యంగా కరోనా అనంతరం చిన్నారుల్లో తీవ్ర ప్రతికూల ప్రభావం చూపినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.

చిన్న వయసులోనే అనేక సమస్యలు..

మొబైల్ వ్యసనంతో పిల్లలు వివిధ రకాల జబ్బుల బారిన పడుతున్నారు. కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్న వయసులోనే అటెన్షన్ డెఫిషిట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) బారిన పడుతున్నారు. ఇది నరాల అభివృద్ధి ప్రతిబంధకాల్లో ఒకటి. దీని వల్ల అనేక నష్టాలు సంభవిస్తాయి.

- ఈ జబ్బు బాల్యంలో మొదలై యుక్త వయసు వరకూ ఉంటుంది
- ఏడీహెచ్‌డీ సోకిన చిన్నారులు దేనిపైన కూడా శ్రద్ధ వహించలేరు
- తోటి పిల్లలతో సరిగా ప్రవర్తించలేక పోతుంటారు
- మనం పిలిచినా వినకపోవడం, చెప్పినవి వెంటనే మర్చిపోవడం కూడా జరుగుతుంటాయి.
- అతిగా మాట్లాడటం , అర్థం చేసుకోలేకపోవడం ప్రధానంగా ఉంటాయి
- ఎక్కువ రిస్క్ తీసుకుంటారు..అదుపు చేయడం కష్టం
- ఈ జబ్బుకు అనేక కారణాలున్నా.. మొబైల్ వ్యసనం తీవ్ర ప్రభావం చూపుతున్నట్టు తేలింది
- ఏడీహెచ్‌డీతో పాటు చూపు మందగింపు, నరాల బలహీనతలు చోటు చేసుకుంటున్నాయి.

తల్లిదండ్రులు తప్పు చేస్తున్నారు



చాలామంది తల్లిదండ్రులు మొండి స్వభావం ఉన్న లేదా మారాం చేసే వాళ్లకు సెల్‌ఫోన్ ఆటవస్తువులా ఇచ్చి తప్పు చేస్తున్నారు. పిల్లలు బానిసలై మిగతా కోణాల్లో ఎదగలేరు. చదువులోనూ వెనుకబడిపోతారు. సెల్‌ఫోన్ అనేది చిన్నపిల్లల ఎదుగుదలకు పెద్ద ప్రతిబంధకం అనేది తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

– డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు

త్వరలో మడకశిరకు కృష్ణా జలాలు

- హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్



మడకశిర: త్వరలోనే మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలను విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ తెలిపారు. ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ ఈనెలాఖరులో మడకశిర ప్రాంతానికి కృష్ణా జలాలు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కృష్ణా జలాలను మడకశిరకు మొదట విడుదల చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారన్నారు. ఈ నేపథ్యంలో మొదట మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈసారి అమరాపురం వరకూ కృష్ణాజలాలను తీసుకెళ్లడానికి కాలువలను కూడా సిద్ధం చేశామని స్పష్టం చేశారు. తాత్కాలికంగా కాలువలను రూ.2.31 కోట్లతో సిద్ధం చేశామన్నారు. భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో మడకశిర ప్రాంతానికి ఎగువన హిందూపురం వద్ద గత ఏడాది దెబ్బతిన్న కాలువకు కూడా మరమ్మతు పనులు పూర్తి చేశామని చెప్పారు. ఇటీవలనే హిందూపురం ప్రాంతంలో కురిసిన వర్షాలకు మళ్లీ కాలువ కొంత వరకు దెబ్బతిందన్నారు. త్వరలోనే కాలువకు మరమ్మతు పనులు చేపడుతామని తెలిపారు.

అనుమానం పెనుభూతమై..

- భర్త చేతిలో భార్య హతం



రక్తపు మడుగులో అంజలి (ఇన్‌సెట్) అంజలి (ఫైల్)

బెళుగుప్ప: అనుమానం పెనుభూతమైంది. ఓ వివాహిత ప్రాణాలు తీసింది. భర్త చేతిలో భార్య దారుణంగా హత్యకు గురైన ఘటన మండలంలోని గంగవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గంగవరం గ్రామానికి చెందిన రమేష్‌తో గుంతకల్లు పట్టణానికి చెందిన ఉసేనమ్మ, వెంకటేశుల రెండో కుమార్తె అంజలి(25)కి 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఏడు సంవత్సరాల కుమార్తె ధరణి, ఐదేళ్ల కుమారుడు లోకేష్ ఉన్నారు. గంగవరం గ్రామానికి చెందిన ఓబులేసు తన కోరిక తీర్చాలంటూ కొంత కాలంగా అంజలి వెంట పడుతూ వేధిస్తున్నాడు. బుధవారం రమేష్ కూలి పని నిమిత్తం బయటికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చిన ఆయనకు ఇంట్లో ఓబులేసు కనిపించాడు. రమేష్‌ను చూసి వెంటనే ఓబులేసు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో అంజలికి, భర్తకు మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన రమేష్ కట్టెతో ఆమె తలపై బాదడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంజలి తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు.

లోటుపాట్లు లేకుండా చూడాలి



మందులు, కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు


పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం పుట్టపర్తి మండలం నిడిమామిడిలో డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డితో కలిసి వైద్యశిబిరాన్ని సందర్శించారు. శిబిరానికి విచ్చేసిన ప్రజలతో ఏర్పాట్లపై ఆరాతీశారు. వైద్య పరీక్షలు ఎలా చేస్తున్నారో పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, ల్యాబ్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, న్యూట్రీషియన్ స్టాల్, మందులు ఇచ్చే కౌంటర్, కంటి పరీక్షా కేంద్రాలను పరిశీలించి రోగులతో ముఖాముఖి మాట్లాడారు.

నేరుగా వచ్చే వారికీ వైద్యం..

కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వైద్యులు చెప్పిన సూచనలు పాటించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇందుకోసం మాతా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఇచ్చిన టోకెన్లే కాకుండా నేరుగా వైద్య శిబిరానికి వచ్చే వారికి సైతం టోకెన్లు ఇచ్చి డేటా ఎంట్రీ చేయాలన్నారు. ప్రతి రోగికీ కేస్‌షీట్ ఇచ్చి మందులు జాగ్రత్తగా తీసుకెళ్లడానికి అవసరమైన బ్యాగ్ అందజేయాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో 600 మందికి టోకెన్లు ఇవ్వగా 552 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, కోఆప్షన్ మెంబర్ మాబుసాహెబ్, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు బాలు, మహేశ్వరరెడ్డి, వైద్యాధికారులు జోత్స్న, షారుక్, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగగొట్టంలో ఇరుక్కుపోయి వ్యక్తి మృతి





పురుషోత్తం ఇంటి పై ఉన్న పొగగొట్టం, పొగగొట్టంలో ఇరుక్కుపోయి మృతి చెందిన గంగాధర నాయక్

గోరంట్ల: మండల పరిధిలోని చౌండూరివాండ్లపల్లికి చెందిన గంగాధరనాయక్ (52) అనే వ్యక్తి ఇంట్లో అమర్చిన పొగ గొట్టంలో ఇరుక్కుపోయి ఊపిరి ఆడక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. గంగాధర్‌నాయక్ ఈనెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే .. చౌండూరివాండ్లపల్లికే చెందిన పురుషోత్తం చాలా రోజుల క్రితమే బెంగళూరుకు వెళ్లిపోవడంతో వాళ్ల ఇల్లు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఆ ఇంట్లో గుజిరీ సామాన్లను ఉంచారు. ఈ నేపథ్యంలోనే పురుషోత్తం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా పొగగొట్టంలో ఇరుక్కుపోయిన మృతదేహం గుర్తించి వెలికితీశారు. ఆ మృతదేహం గంగాధర్‌నాయక్‌దిగా పోలీసులు గుర్తించారు. కాగా... మద్యానికి బానిసైన గంగాధరనాయక్ ఇంట్లో ఉన్న గుజిరీ సామానును దొంగిలించేందుకు ప్రయత్నించి చనిపోయినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

గ్రామ సంఘాల అభివృద్ధికి తోడ్పడదాం

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

అమడగూరు: వైకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సంఘాల అభివృద్ధికి తోడ్పడదామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. గురువారం ఓడీ చెరువు వైకేపీ కార్యాలయంలో అమడగూరు, ఓడీ చెరువు, నల్లమాడ, తనకల్లు మండలాలకు చెందిన సీసీలు, యానిమేటర్లు, తదితరులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఓడీ చెరువు క్లస్టర్‌కు సంబంధించి ప్రస్తుతం రూ.50 లక్షల రుణాలను ఇవ్వాల్సి ఉందన్నారు. సంబంధిత సిబ్బంది గ్రామ సంఘాలను గుర్తించి వారికి రుణాలను ఇప్పించి సకాలంలో తిరిగి కంతులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తర్వాత మండలాల వారీగా సమీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనిధి జనరల్ మేనేజర్ వేణుగోపాల్, ఏరియా కోఆర్డినేటర్ రామ్మోహన్, ఏపీఎంలు గోపాల్, రమణప్ప, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వైకేపీ సమావేశంలో మాట్లాడుతున్న సిబ్బంది

అన్నదాతలకు అండగా ఉందాం

- బ్యాంకర్ల ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కలిగిద్దాం
- రైతన్నలను కష్టపెడితే సీఎం జగన్ సహించరు
- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- సజావుగా స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: 'అన్నదాతలకు ధైర్యం చెబుదాం.. వారికి అండగా ఉందాం' అని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు–1, 7(ఆర్థిక, ప్రణాళిక/ఇంజినీరింగ్/వ్యవసాయ, అనుబంధ శాఖలు) సమావేశాలు సజావుగా జరిగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా లేపాక్షి, గుమ్మఘట్ట, రొళ్ల జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, మహేశ్, అనంతరాజు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో ఎక్కువ శాతం మంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారని, అరకొరగా సాగు చేసిన పంటలు కూడా వర్షాభావం, చీడపీడలతో దెబ్బతింటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయి, ఆందోళనలో ఉండగా, పంటల సాగుకు చేసిన అప్పులు కట్టాల్సిందేనంటూ బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కొన్ని చోట్ల వ్యవసాయం కోసం రుణంగా తీసుకున్న ట్రాక్టర్లను వేలం వేస్తామని, కేసులు పెడతామంటూ బ్యాంకర్లు బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకర్ల బారి నుంచి రైతులను కాపాడాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమంపై సీఎం జగన్ చాలా స్పష్టతతో ఉన్నారన్నారు. ఎవరైనా రైతులను పీడించినా, ఒత్తిడి తెచ్చినా, బెదిరించినా సహించరన్నారు. ఈ విషయం క్షేత్రస్థాయిలోని రైతులకు తెలియజేద్దామన్నారు.

'అమూల్' డెయిరీలు ఏర్పాటు చేయండి..

అమూల్ పాల డెయిరీల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని, అందువల్ల జిల్లాలో డెయిరీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని కుందుర్పి జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సర్పంచులు, ఎంపీపీలు కొన్ని చోట్ల తీర్మాన కాపీలు ఇవ్వడం లేదని, అవి లేనిదే పనులు ప్రారంభించడానికి వీల్లేదంటూ ఇంజినీరింగ్ అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని విడపనకల్లు జెడ్పీటీసీ సభ్యులు హనుమంతు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు సమావేశంలో ప్రస్తావించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు సిమెంట్, ఇసుక కొరత సమస్యగా మారిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన పనులు ప్రారంభించకపోతే పక్క మండలాలకు మళ్లించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పని విలువ రూ.5 లక్షలలోపైతే నామినేషన్, ఆపై మొత్తానికైతే టెండర్ల పద్ధతిలో పనులు కేటాయిస్తామని పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈలు తెలిపారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్

మున్సిపాలిటీల బకాయిలు చెల్లించకపోతే ఎలా?

శ్రీరామరెడ్డి, శ్రీసత్యసాయి పథకాల నుంచి తాగునీటిని మున్సిపాలిటీలకు సరఫరా చేస్తే అందుకు సంబంధించిన పన్నులు జెడ్పీకి చెల్లించకపోతే ఎలాగని చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. మొత్తం రూ.80.57 కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. హిందూపురం మున్సిపాలిటీ నుంచి రూ.38.48 కోట్లు, తాడిపత్రి నుంచి రూ.22.85 కోట్లు, కళ్యాణదుర్గం నుంచి రూ.13.27 కోట్లు, మడకశిర నుంచి రూ.2.29 కోట్లు, గుత్తి నుంచి రూ.36.8 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏకపక్ష నిర్ణయాలతో జెడ్పీకి రావాల్సిన నీటి పన్నును మళ్లించుకోవడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

బ్యాంకర్ల తీరుపై గరంగరం..

స్థాయీ సంఘం–3 సమావేశానికి అధ్యక్షుడు తాడిమర్రి సుధాకర్‌రెడ్డి (ధర్మవరం జెడ్పీటీసీ) రాకపోవడంతో గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ చర్చను ప్రారంభించారు. బ్యాంకర్ల తీరును సభ్యులందరూ తప్పుబట్టారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదుకు సంబంధించిన గడువు మరింత పెంచాలని, లేకపోతే రైతులు నష్టపోతారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. జిల్లాలో 97 శాతం ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని సీఈఓ కేతన్ తెలిపారు. మిగిలిన మూడు శాతం కూడా త్వరలో పూర్తవుతుందని రైతులు తొందరపడేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని కోరారు.

రబ్బరు బాట.. ప్రగతికి పెద్దపీట

- జేఎన్‌టీయూలో విస్తృత పరిశోధనలు
- సహజ రబ్బరు వినియోగంతో రహదారుల నిర్మాణం దిశగా ప్రయోగాలు
- దీర్ఘకాలం మన్నికయ్యే రహదారుల ఏర్పాటుకు దోహదం
- నాలుగేళ్ల పరిశోధన ప్రాజెక్టుకు రూ.1.75 కోట్ల కేటాయింపు
- తొలి విడత నిధులు మంజూరు చేసిన భారత రహదారుల మంత్రిత్వశాఖ



జేఎన్‌టీయూలో పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసిన పాలిమర్ మోడిఫైడ్ తారు

అనంతపురం: తక్కువ ఖర్చుతో దీర్ఘకాలం మన్నిక వచ్చేలా తారురోడ్లు నిర్మాణంపై జేఎన్‌టీయూ (ఏ)లో ప్రయోగాలు ఊపందుకున్నాయి. వర్సిటీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏడాదిగా సాగుతున్న సహజ రబ్బరు, తారు సమ్మేళనం చేసి రహదారుల నిర్మాణానికి సంబంధించి విస్తృత పరిశోధనలు ఓ కొలిక్కి వచ్చాయి. ఇందుకు సంబంధించి భారత రహదారుల మంత్రిత్వ శాఖ రూ.1,75,23,000ను కేటాయించగా, ఇప్పటికే తొలి విడత నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జేఎన్‌టీయూ(ఏ) సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేసి, ప్రయోగాలు ముమ్మరం చేశారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రబ్బరు రోడ్ల నిర్మాణం స్థితిగతులపై అంచనా వేసి భారత రహదారుల శాఖకు నివేదిక ఇవ్వనున్నారు. ఈ నివేదికకు ఆమోదం పొందిన వెంటనే రబ్బరు రోడ్ల నిర్మాణాలు అందుబాటులోకి రానున్నాయి.

కలకాలం మన్నిక..

సహజ రబ్బరుతో కూడిన పాలిమర్ మోడిఫైడ్ ఏజెంట్ అనే పదార్థం తారుతో మిశ్రమం చేస్తే దీర్ఘకాలం మన్నిక వస్తుందని పరిశోధనల్లో జేఎన్‌టీయూ అధికారులు నిర్ధారించారు. ఇదే అంశాన్ని భారత రహదారుల మంత్రిత్వ శాఖకు నివేదించడంతో పూర్తి స్థాయి పరిశోధనలకు అనుమతులు జారీ అయ్యాయి. దీంతో సహజ రబ్బరులోని కొన్ని రకాల కెమికల్స్‌ను కలపడం ద్వారా ఎక్కువ కాలం దృఢంగా ఉంటుందని విస్తృత ప్రయోగాలు సాగుతున్నాయి.

రహదారుల ఇంజినీరింగ్‌లో కీలక మలుపు..

ట్రాన్స్‌పోర్ట్ ఇంజినీరింగ్ (రహదారుల)లో రబ్బరు రోడ్లు కీలకంగా మారనున్నాయి. పూర్తిగా తారును వినియోగించి రోడ్ల నిర్మాణం చేపడితే వచ్చే వ్యయం కంటే రబ్బరు మోడిఫైడ్ తారుతో నాగనికి పైగా వ్యయం తగ్గుతుందని ప్రయోగాల ద్వారా నిర్ధారణ అయింది. ఈ క్రమంలో తాజా ప్రయోగం విజయవంతమైతే రోడ్ల స్వరూపమే మారిపోనుంది. ఈ క్రమంలో తారు–సహజ రబ్బరు మిశ్రమానికి ప్రాధాన్యత ఏర్పడింది.

15 రకాల పరీక్షలు నిర్వహిస్తాం

రోడ్ల నిర్మాణానికి పాలిమర్ మోడిఫైడ్ ఏజెంట్, తారు మిశ్రమం ఎలా దోహదపడుతుందనే అంశంపై మాడ్యూళ్లుగా పరిశోధనలు సాగుతున్నాయి. మొత్తం 15 రకాల పరీక్షలు నిర్వహించనున్నాం. దక్షిణ భారతదేశంలో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఈ మిశ్రమంతో రోడ్ల నిర్మాణం చేపడితే ఎన్ని రోజుల పాటు మన్నికగా ఉంటుందనే అంశంపై ప్రస్తుతం పరిశోధనలు చేస్తాం.

– ఆచార్య సి.శశిధర్, సహజ రబ్బరు మిశ్రమ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ(ఏ)

క్లుప్తంగా

గడువులోపు నిర్మాణాలన్నీ పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ సీఈ అమరనాథరెడ్డి



ఇంజినీర్లతో సమీక్షిస్తున్న చీఫ్ ఇంజినీర్ అమరనాథరెడ్డి

అనంతపురం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత గా చేపట్టిన సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర భవన నిర్మాణాలను గడువు లోపు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ అమరనాథరెడ్డి ఆదేశించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, నాడు – నేడు పనులపై అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ రీజనల్ కార్యాలయంలో చెందిన ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఆయన సమీక్షించారు. భవన నిర్మాణాల పురోగతిలో 90 శాతం ప్రగతితో ముందు వరుసలో ఉన్న శింగనమల సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధారెడ్డి భాస్కర్‌రెడ్డిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే భవన నిర్మాణాల్లో రాయలసీమ జిల్లాల్లోనే శింగనమల నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు లక్ష్మీ భాగ్యరాజ్ (అనంతపురం), గోపాల్ రెడ్డి (శ్రీసత్యసాయి జిల్లా), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆర్.భాస్కర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ తీరుపై ఆగ్రహం



సమస్యలపై ఆరా తీస్తున్న జీసీ వెల్ఫేర్ అధికారి బాలాజీ

ఎన్పీకుంట: స్థానిక బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ ఆంజనేయులు పనితీరుపై అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థులతో సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని పలువురు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అంతేకాక వార్డెన్‌తో పాటు ఇద్దరు సిబ్బంది హాస్టల్‌లోనే మద్యం సేవించి విధులు నిర్వర్తిస్తుంటారని, మద్యం సేవించిన సమయంలో అసభ్యకర పదజాలంతో తమను వార్డెన్ దూషిస్తూ బాధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్ పనితీరుపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా విలేకరులకు ఆయన తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులను చూపుతున్న పోలీసులు

తాడిమర్రి: అక్రమంగా కర్ణాటక నుంచి తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సీఐ యతీంద్ర వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సీఐ యతీంద్ర నేతృత్వంలో తాడిమర్రి మండలం దాడితోట సమీపంలో కాటికోటేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం వద్ద గురువారం తెల్లవారుజామున పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన స్కార్పియో (ఏపీ 27 ఏఏ 9448)ను ఆపి పరిశీలించగా, 90 ఎంఎల్ సామర్థ్యమున్న 2,112 బాటిళ్ల విస్కీ, 15 బాక్సుల్లో 360 టిన్నుల బీరు బాటిళ్లు, మరో పది బాక్సుల్లో రాయల్‌ఛాలెంజ్ స్ట్రాంగ్ బీరు బాటిళ్లు పట్టుబడ్డాయి. వాహనాన్ని సీజ్ చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామానికి చెందిన నిమ్మకాయల రామాంజినేయులు, వైఎస్సార్ జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం బెడుదూరు కొట్టాలపల్లికి చెందిన కంచిమారెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. కర్ణాటకలో తక్కువ ధరతో కొనుగోలు చేసిన మద్యాన్ని వైఎస్సార్ జిల్లాలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లుగా నిందితులు అంగీకరించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ నాగస్వామి, హెడ్‌కానిస్టేబుల్ నల్లప్ప, కానిస్టేబుళ్లు రమేష్, శ్రీకాంత్‌ను ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

వృద్ధురాలిపై టీడీపీ నాయకుల దాడి



చికిత్స పొందుతున్న సుబ్బమ్మ

రొద్దం: మండలంలోని కోగిర గ్రామానికి చెందిన వృద్ధురాలు కురుబ సుబ్బమ్మపై స్థానిక టీడీపీ నేత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు టైలర్ ఆంజనేయులు, ఆయన కుటుంబ సభ్యులు దాడికి పాల్పడ్డారు. తలకు తీవ్ర గాయమైన సుబ్బమ్మను పెనుకొండలోని సీహెచ్‌సీకి తరలించారు. గురువారం ఉదయం ఓ ఇంటి స్థానాన్ని గడిలో నీరు వృథాగా రోడ్డుపైకి చేరుతుండడంపై ఘర్షణ పడిందని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్య సేవలు : డీపీఓ

గోరంట్ల: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలను ఉచితంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) విజయకుమార్‌రెడ్డి అన్నారు. గోరంట్ల మండలం గౌనివారిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ప్రభావతితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతి నిరుపేదకూ నాణ్యమైన వైద్యాసేవలు అందించేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, తహసీల్దార్ రంగనాయకులు, వైద్య సిబ్బంది, ఎంపీటీసీ సుకన్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు వీరాంజనేయులు

కనగానపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం నెమలివరం గ్రామానికి చెందిన ఈడిగ వీరాంజనేయులు (33), ప్రమీల దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం తన ఇంటి ఎదుట ఉన్న చెట్టును కొట్టి వేస్తుండగా కొమ్మలు విరిగి 11 కేవీ విద్యుత్ లైన్‌పడ్డాయి. ఆ సమయంలో షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుని షాక్‌కు గురైన వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. కాగా, గ్రామం మీదుగా పోతున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను పక్కకు మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం కారణంగానే వీరాంజనేయులు మృతి చెందాడంటూ ఈ సందర్భంగా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

హస్తకళలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏడీ సత్యమూర్తి

కదిరి టౌన్: హస్త కళలపై కదిరిలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జాతీయ హస్తకళల అభివృద్ధి కార్యక్రమం కమిషనర్ సౌజన్యంతో ఖుష్బూ కాశిస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి హస్తకళల సేవా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి హాజరై మాట్లాడారు. భారతదేశంలో వ్యవసాయం తర్వాత చేతివృత్తుల రంగానిదే అగ్రస్థానమన్నారు. హస్త కళాకారుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. కదిరి కేంద్రంగా హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్ క్రాఫ్ట్‌ను ప్రోత్సహించేందుకు అన్ని విధాల సహకరిస్తున్నామన్నారు. ఖుష్బూ కాశిస్ డైరెక్టర్ యశోద, అఖిల భారత హస్త కళల బోర్డు మాజీ సభ్యుడు వి.ఎస్.రెడ్డి, రాజేష్, సునీత, అలీ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల వేటగాళ్ల అరెస్ట్

అమరాపురం: గుప్త నిధి కోసం తవ్వకాలు చేపట్టిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మునిప్రతాప్ గురువారం వెల్లడించారు. అమరాపురం మండలం పేలబండ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం ఉదయం పేలబండ సమీపంలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరో కర్ణాటకకు చెందిన ఇద్దరు పట్టుబడిన వారిలో అమరాపురం నిజాని కాంతరాజు, చిట్నాదకు చెందిన మంజునాథ్, గుడిబండ మండలం చిగతుర్పికి చెందిన జేసీబీ డ్రైవర్ రాము ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఆలదాపల్లికి చెందిన మూర్తి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు అపహరణ

చిలమత్తూరు: ఏటీఎంలో నుంచి నగదు తీసుకునేందుకు వచ్చిన మహిళను ఏమార్చి ఆమె కార్డుతో డబ్బు అపహరించుకెళ్లిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని పాత బాగేపల్లికి చెందిన జ్యోతి గురువారం ఉదయం కొడికొండ చెక్‌పోస్టులోని ఇండియా ఏటీఎంలో నగదు విత్ డ్రా చేసుకునేందుకు వెళ్లింది. అయితే ఏటీఎంలో నుంచి నగదు తీసుకునే విధానం తెలియకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని సాయం కోరింది. దీంతో నగదు డ్రా చేసి ఇచ్చిన తర్వాత ఆమెను మాటల్లో పెట్టి కార్డు మార్చి మరో కార్డు ఆమె చేతికి ఇచ్చి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఏటీఎం నుంచి రూ.40 వేలు నగదు డ్రా చేసినట్లుగా సెల్‌ఫోన్‌కు సమాచారం అందడంతో ఆశ్చర్యాన ఆమె వెంటనే చిలమత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశారు. నిందితుడు ఏటీఎంలో నగదు డ్రా చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చెల్సీకి 16.097 టీఎంసీలే

- తుంగభద్ర బోర్డు సమావేశంలో నిర్ణయం
- వర్షాభావ పరిస్థితులతో తగ్గిన నీటి కేటాయింపులు
- ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీరు లేనట్లే!



తుంగభద్ర జలాశయం

కేటాయింపులు ఇలా..	
కర్ణాటకకు	68.839 టీఎంసీలు
ఆంధ్రప్రదేశ్	32.936 టీఎంసీలు
ఎల్‌ఎల్‌సీ	11.887 టీఎంసీలు
హెచ్‌ఎల్‌సీ	16.097 టీఎంసీలు
కేసీ కెనాల్	4.953 టీఎంసీలు
తెలంగాణ	3.334 టీఎంసీలు

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం ఈ ఏడాది జిల్లా ఆయకట్టు రైతులకు నిరాశే మిగిలిస్తోంది. ఈ ఏడాది హెచ్చెల్సీకి 16.097 టీఎంసీలు మాత్రమే రానున్నాయి. గురువారం తుంగభద్ర జలాశయం వద్ద బోర్డు సమావేశం జరిగింది. టీబీ బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, గద్వాల ఎస్‌ఈ శ్రీనివాసరావు, హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి, ఎల్‌ఎల్‌సీ ఈఈ నీలకంఠారెడ్డి, కర్నూలు ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తొలుత నిర్ణయించిన 26.828 టీఎంసీల నుంచి 16.097 టీఎంసీలకు కుదిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితులు..

తుంగభద్ర బోర్డు మొదట సమావేశంలో జలాశయంలో 175 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అంచనా వేశారు. దామాషా ప్రకారం హెచ్చెల్సీకి 26.828 టీఎంసీలు వస్తాయని లెక్కలు తేల్చారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. సాధారణంగా ఆగస్టులో భారీ వర్షాలు పడేవి. ఈ సారి ఆ పరిస్థితి లేకపోగా వర్షాకాలం లో వరదే పెద్దగా రాలేదు. ఫలితంగా జలాశయం నీటిమట్టం భారీగా పడిపోయింది. ఇప్పటికే 53.213 టీఎంసీలకు నీటిమట్టం పడిపోయింది. జలాశయంలో ఇప్పటి 3,935 క్యూసెక్కులుగా ఉండగా 9,556 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదవుతోంది.

ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరం..

హెచ్చెల్సీకి 16.097 టీఎంసీలు మాత్రమే రానుండడంతో ఆయకట్టు పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. వచ్చే నీటిలో 10 టీఎంసీలు తాగునీటి అవసరాలకు కేటాయించాల్సి ఉంటుంది. మిగిలిన 6.097 టీఎంసీలు మాత్రమే చెరువులు, ఆయకట్టుకు విడుదల చేయనున్నారు. ఇప్పటికే తుంగభద్ర నుండి 8.55 టీఎంసీలు విడుదలయ్యాయి. ఇక మిగిలింది 7.547 టీఎంసీలు మాత్రమే విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆయకట్టుకు సాగునీరు సాధ్యపడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తాగునీటికే ప్రాధాన్యం

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా హెచ్చెల్సీకి దామాషా ప్రకారం 16.097 టీఎంసీలు మాత్రమే వస్తున్నాయి. నవంబర్ 10 వరకూ ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో తుంగభద్ర జలాలు వస్తాయి. ఆ తర్వాత వచ్చే పరిస్థితి లేదు. హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీలకు కూడా నీటి విడుదల నిలిపివేస్తాం. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆయకట్టు కన్నా తాగునీటికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించాం.

– ఎన్. రాజశేఖర్, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

సీఎంను కలిసిన ఎంపీ మాధవ్



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు.

యువకుడి దుర్మరణం



మృతుడు వినోద్

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని సేలం నివాసి వినోద్ (25) బుధవారం రైలులో షోలాపూర్‌కు ప్రయాణమయ్యాడు. పెనుకొండ మండలం రంగేపల్లి దాటిన తర్వాత ఫుట్‌పాత్ సమీపంలోకి చేరుకోగానే తలుపు వద్ద నిలబడిన ఆయన అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కారు బోల్తా - యువకుడి మృతి

గోరంట్ల: కర్ణాటకలో బోను చేసుకున్న ప్రమాదంలో గోరంట్లకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిరంజీవి (35) బుధవారం వ్యక్తిగత పనిపై కారులో కర్ణాటకకు వెళ్లాడు. పని ముగించుకుని రాత్రికి తిరుగు ప్రయాణమయ్యాడు. కర్ణాటకలోని పేరేసంద్రం వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించలేక రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో కారు బోల్తాపడడంతో కారు నడుపుతున్న చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మాలగుండ్ల మల్లికార్జున, డీసీసీబీ డైరెక్టర్ పాటూరి శంకర రెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దుసుంజరెడ్డి, నాయకులు నాగేనాయక్, మేదా రసూల్, అశ్వర్థప్ప తదితరులు గురువారం ఉదయం చిరంజీవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు జిల్లా వాసి దుర్మరణం

చిలమత్తూరు: ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో మరో వాహన డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు లోడుతో బుధవారం రాత్రి బయలుదేరిన ఐచర్ వాహనాన్ని చిలమత్తూరు మండలం మద్దిరాళ్ళ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి దూసుకొచ్చిన మరో ఐచర్ ఢీకొంది. ఘటనలో ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్, కర్నూలు జిల్లా కోసిగికి చెందిన బుసప్ప (39) అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళుతున్న వాహనాన్ని గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో వెలుగుచూసింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, PUTTAPARTHI.
E.P. 2/2023 in O.S. 93/21

Between :
D. Raja Reddy ...D.H.R
And
G. Venugopal ...J.D.R

To
G.వేణుగోపాల్ S/o. G.గోవిందప్ప, బుగ్గపల్లి, పుట్టపర్తి.
ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావా లో 28-11-2023 వ తేదీన మీరు గాని, మీ వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టు నందు హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై అర్జీ మీ వర్జితముగా తీర్మానించబడును అని తెలియజేయడం అయినది.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
శ్రీమతి కె.జయసుధ, న్యాయవాది, పెనుకొండ. Cell : 9490859185

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
శ్రీ సత్యసాయి జిల్లా, పుట్టపర్తి
రీ-టెండరు ప్రకటన

స్టేజ్-2 రవాణా కాంట్రాక్టర్ నియామకము కొరకు ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యావసర వస్తువుల రవాణా నిమిత్తం

నెం. PDS Movt. FG. 5(3) 2023-2025 తేది : 06-10-2023

ఆహార ధాన్యములు ఇతర నిత్యావసర వస్తువులు (మధ్యాహ్న భోజన పథకం మరియు ఐ.సి.డి.ఎస్. తదితరములు) మండల స్థాయి గిడ్డంగుల నుండి చౌక ధరల దుకాణములకు రవాణా చేయుటకు మరియు డీలర్ వద్ద నుండి ఖాళీ సంచులను రవాణా చేయుటకు గాను, 2023-2025 సంవత్సరములకు (నియామకపు తేదీ నుండి 31-08-2025) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారు శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిధిలో 12MLS పాయింట్లకు టెండర్ ప్రకటన ఇవ్వగా, అందులో 7 MLS పాయింట్లకు టెండరు ఖరారు కాగ మిగిలిన 5 MLS పాయింట్లకు రీ-టెండరు ప్రకటన ప్రకటన ఇవ్వడం జరిగింది. 5 మండల స్థాయి పాయింట్లకు 1) బుక్కపట్నం 2) సికెపల్లి 3) కదిరి 4) ఓ.డి. చెరువు 5) ధర్మవరం స్టేజీ-II, రవాణా కాంట్రాక్టరులను నియమించుటకు గాను అర్హత గల అభ్యర్థుల / అసోసియేషన్లు / భాగస్వామ్య సంస్థల నుండి సీల్డ్ టెండర్లను కోరడమైనది. దరఖాస్తు సొమ్ము ఈ క్రింది విధముగా ఉండును.

క్రమ సంఖ్య	నెలవారి కేటాయింపుల మెట్రిక్ టన్నులలో	దరఖాస్తు సొమ్ము రూ.	సెక్యూరిటీ డిపాజిట్ రూ.
1	Upto 500 MTs	50,000/-	3,25,000/-
2	501 and 800 MTs	75,000/-	4,00,000/-
3	800 MTs above	1,00,000/-	6,00,000/-

టెండరు అమ్మకం	టెండరు దాఖలు తేదీ	టెండరు తెరుచు తేదీ
06-10-2023 నుండి 11-10-2023 సా॥ 05-00 గం॥ల వరకు	16-10-2023 ఉ॥ 10 గం॥ నుండి మ॥ 12.30 గం॥ల వరకు	16-10-2023 మ॥ 3-30 గం॥లకు

టెండరు షెడ్యూల్ అవసరమైన ఉన్న జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, శ్రీ సత్యసాయి జిల్లా వారి సమక్షంలో టెండర్ బాక్సు తెరువబడును.

టెండరు ఫారం మరియు ఇతర నియమ నిబంధనలు కొరకు రూ. 10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా "DISTRICT CIVIL SUPPLIES MANAGER, APSCSCL, SRI SATYASAI" వారి పేరున శ్రీ సత్యసాయి జిల్లాలో చెల్లుబాటు అయ్యే విధంగా ఏదేని జాతీయ బ్యాంకు ద్వారా చెల్లింపు చేయవలెను. టెండరు ఫారం కొరకు చెల్లించిన రూ. 10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ తిరిగి ఇవ్వబడదు.

సం/– శ్రీ కె.శ్రీదేవి, ఐ.ఎ.ఎస్.,
జాయింట్ కలెక్టర్ మరియు వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, (ఎ.పి.ఎస్.సి), శ్రీ సత్యసాయి జిల్లా